సాక్షి
తూర్పుగోదావరి
శుక్రవారం । 9 । ఫిబ్రవరి । 2024



నిడదవోలు.. ప్రగతి జోరు

వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన ఐదేళ్లలో నిడదవోలు పురపాలక సంఘంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జోరుగా జరుగుతున్నాయి.


8లో



వెండి కొమ్ముల సమర్పణ

ప్రత్తిపాడు రూరల్: రాచపల్లి అరుణాచలేశ్వర ఆలయంలో బసవేశ్వరస్వామికి చిట్టంశెట్టి పుల్లయ్య దంపతులు (ఏలేశ్వరం) 1,250 గ్రాముల వెండి కొమ్ములు సమర్పించారు.

డెల్టాలకు 7,800 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 7,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,300, మధ్య డెల్టాకు 1,500, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.45 అడుగులుగా నమోదైంది.

అన్నదాతకు వరిసిరులు

- 'తూర్పు'న ముగిసిన ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ
- ప్రతి గింజా కొనుగోలు చేసిన ప్రభుత్వం
- విక్రయించిన రెండు రోజుల్లోనే రైతుల ఖాతాల్లోకి నగదు
- కొన్న ధాన్యం విలువ రూ.495 కోట్లు
- ఇప్పటి వరకూ చెల్లింపులు రూ.484 కోట్లు



చాగల్లులో బస్తాల్లో ధాన్యం నింపుతున్న రైతులు



ధాన్యం తరలిస్తున్న రైతులు, అధికారులు

సాక్షి, రాజమహేంద్రవరం: సాగుకు అనువైన సమయంలో నీటి విడుదల.. సకాలంలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల అందజేత.. వరి కోతలు ప్రారంభం కాగానే అందుబాటులోకి ధాన్యం కొనుగోలు కేంద్రాలు.. తుపాను ప్రభావంతో ధాన్యం తడిసినా రైతులు నష్టపోకుండా మద్దతు ధరకే సేకరించడం.. కొనుగోలు చేసిన రెండు రోజుల్లోపే రైతుల ఖాతాల్లో నగదు జమ చేయడం.. మునుపెన్నడూ లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యలు ఖరీఫ్ రైతుల ఇంట సిరులు నింపింది. తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు ముగిశాయి. దీంతో కొనుగోలు కేంద్రాలు మూసివేశారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు అధికార యంత్రాంగం ధాన్యం సేకరణ ప్రక్రియ చేపట్టి, విక్రయించిన ధాన్యానికి సకాలంలో డబ్బులు ఇవ్వడంతో రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

లక్ష్యం 2.52 లక్షల మెట్రిక్ టన్నులు

జిల్లావ్యాప్తంగా ఖరీఫ్‌లో 72,868 హెక్టార్లలో వరి సాగు జరిగింది. 4.49 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. స్థానిక అవసరాలకు పోగా.. 2.52 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లాలో 300 రైతుభరోసా కేంద్రాలు (ఆర్‌బీకే) ఉండగా 231 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు చేపట్టారు. అటు కోతలు జరుగుతూండగానే ఇటు కొనుగోళ్లు ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 63 లక్షల గోనెసంచులు అవసరమని గుర్తించి.. 56,77,843 సంచులు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఫలితంగా గోనెసంచుల కొరత తీరింది.

ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి 47,927 కూపన్లు జనరేట్ చేసి, 46,462 మంది రైతుల నుంచి 2,27,832 మెట్రిక్ టన్నులు సేకరించారు. మిగిలిన ధాన్యాన్ని రైతులు బహిరంగ విపణిలో విక్రయించడంతో కొనుగోలు కేంద్రాలను మూసివేశారు.

ముందుగానే మద్దతు ధర

కొనుగోళ్లకు ముందుగానే ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. గతం కంటే ప్రస్తుతం క్వింటాల్‌కు రూ.143 పెంచింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సాధారణ రకం క్వింటాల్ ధాన్యానికి రూ.2,183, గ్రేడ్-ఎ రకానికి రూ.2,203గా మద్దతు ధర నిర్ణయించింది. ఇది రైతుల్లో ఆనందాన్ని నింపింది.

చెల్లింపుల్లో ఘనత

రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి డబ్బుల చెల్లింపుల్లో కూడా ప్రభుత్వం చరిత్ర సృష్టించింది. చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ధాన్యం విక్రయించిన 72 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేశారు. ప్రభుత్వం సేకరించిన 2,27,832 మెట్రిక్ టన్నుల ధాన్యం విలువ రూ.495.81 కోట్లు కాగా.. ఇప్పటి వరకూ 45,380 ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ల(ఎఫ్‌టీఓ)కు రూ.484.31 కోట్లు చెల్లించారు. రైతుల వైపు నుంచి ఆధార్ వివరాలు సక్రమంగా లేకపోవడం వంటి సాంకేతిక సమస్యల కారణంగానే మిగిలిన రూ.11.50 కోట్ల చెల్లింపులు ఆగాయి. దీనిని అధిగమించి, ఆ రైతులకు కూడా చెల్లింపులు జరిపేందుకు అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. త్వరలోనే మిగిలిన రైతుల ఖాతాల్లో కూడా సొమ్ము జమ చేయనున్నారు.

గతం అధ్వానం

టీడీపీ ప్రభుత్వ హయాంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ అస్తవ్యస్తంగా ఉండేది. ధాన్యం కొన్న నెల రోజులకు డబ్బులు ఇస్తే గగనమే అన్న పరిస్థితి ఉండేది. తేమ శాతం, దెబ్బ తిన్న ధాన్యం పేరుతో కొర్రీలు పెట్టి మరీ రైతులకు చెల్లించాల్సిన మొత్తంలో కోత విధించేవారు. చేసేది లేక రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోవాల్సిన దుస్థితి ఉండేది.

దళారులకు ఆస్కారం లేకుండా..

తేమ, రంగు మారడం, బహిరంగ విపణిలో ధర పలకడం లేదన్న కారణాలు చెప్పి రైతులను దళారులు మోసం చేయకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సేకరణ ప్రక్రియ పారదర్శకంగా, పక్కాగా చేపట్టారు. దళారుల మోసాలకు చెక్ పెట్టడంపై ప్రత్యేక దృష్టి సారించారు. కొనుగోలు మొదలు మిల్లులకు అప్పగించడం, తిరిగి మిల్లర్ల నుంచి బియ్యం సేకరణకు అధికార యంత్రాంగం అన్ని చర్యలూ తీసుకుంది. ఆర్‌బీకేల వద్ద సిబ్బందిని సిద్ధంగా ఉంచారు. ఈ-క్రాప్, తేమ శాతం నిబంధనల ప్రకారం విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు ధాన్యం సేకరించారు. గ్రామ వలంటీర్లను సైతం భాగస్వాముల్ని చేయడం సత్ఫలితాలనిచ్చింది. ధాన్యం రవాణా చేసే వాహనాలపై నిఘా పెట్టారు. రవాణా చార్జీలు ఎవరికి చెల్లించాలనే విషయమై జాగ్రత్తలు తీసుకున్నారు.

విపత్తులోనూ అండగా..

డిసెంబర్ మొదటి వారంలో సంభవించిన మిచాంగ్ తుపానుపై ప్రభుత్వం ముందుగానే అప్రమత్తమైంది. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకూడదన్న ఉద్దేశంతో అధికార యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టింది. రోడ్డుపై ఉన్న ధాన్యానికి నష్టం వాటిల్లకుండా ఆయా రైతుల నుంచి ఆఫ్‌లైన్‌లో సైతం 6,367 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ధాన్యం కొనుగోళ్లపై సందేహాల నివృత్తికి, ఫిర్యాదులకు కలెక్టరేట్‌లో ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకూ అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూము ఏర్పాటు చేశారు. ఇవన్నీ సత్ఫలితాలనివ్వడంతో జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు విజయవంతంగా జరిగాయి.

పారదర్శకంగా సేకరణ



ప్రభుత్వ ఆదేశాల మేరకు వరి రైతులకు అండగా ఉండేందుకు ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా చేపట్టాం. కోతలు ప్రారంభమైనప్పటి నుంచే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాం. దళారుల చేతిలో రైతులు మోసపోకుండా మద్దతు ధరకే ధాన్యం సేకరించాం. తుపాను విపత్తు సమయంలో సైతం రైతులు నష్టపోకుండా ఆఫ్‌లైన్‌లోనే కొనుగోలు చేశాం. ధాన్యం సొమ్ము ఎప్పటికప్పుడు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నాం.

– కె.మాధవీలత, కలెక్టర్, తూర్పు గోదావరి జిల్లా

సాంకేతిక కారణాలతో...

రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి సంబంధించిన నగదును ఎప్పటికప్పుడు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నాం. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి రూ.495.81 కోట్లు చెల్లించాల్సి ఉండగా ఇప్పటికే రూ.484.31 కోట్లు చెల్లించాం. మిగిలిన రూ.11.50 కోట్ల చెల్లింపుల్లో మా నుంచి ఎలాంటి జాప్యం లేదు. సంబంధిత రైతుల వైపు నుంచి ఆన్‌లైన్ ప్రక్రియ, ఆధార్ కార్డుల్లో తప్పులు దొర్లడం వంటి సాంకేతిక సమస్యలతో ఆగింది. వాటిని సరిదిద్ది, త్వరితగతిన వారి ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకుంటాం.

– పి.రాధిక, జిల్లా మేనేజర్, పౌరసరఫరాలు, తూర్పు గోదావరి

న్యూస్‌రీల్

రెండో దశ ఇళ్ల నిర్మాణం వేగవంతం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లాలో రెండో దశ ఇళ్ల నిర్మాణాల లక్ష్యం 19,253 కాగా, ఇప్పటి వరకూ 6,750 పూర్తి చేశామని కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి వివిధ అంశాలపై కలెక్టర్లతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి కలెక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాధవీలత మాట్లాడుతూ, జిల్లాలో 9,500 ఇళ్లు పురోగతిలో ఉన్నాయని చెప్పారు. 53,269 మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇంటి నిర్మాణం కోసం అదనపు రుణాలు ఇచ్చామని తెలిపారు. జిల్లాలో సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ) ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుర్తించి, నివేదిక అందిస్తామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 వైద్య శిబిరాలు 138 నిర్వహించి, 59 వేల మందికి వైద్య సేవలు అందించామని కలెక్టర్ తెలిపారు.

రాష్ట్ర స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలకు 114 మంది



క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతున్న జేసీ తేజ్‌భరత్

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): జిల్లా స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన 114 మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు గురువారం విశాఖపట్నం వెళ్లారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల నుంచి వారు 10 బృందాలుగా రెండు బస్సుల్లో బయలుదేరారు. ఈ సందర్భంగా వారినుద్దేశించి జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ మాట్లాడుతూ, జిల్లా తరఫున క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడల్లో పురుష, మహిళా క్రీడాకారులకు విడివిడిగా పోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటీల్లో జిల్లా స్థాయి విజేతలుగా నిలిచిన జట్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు విశాఖ వెళ్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో కోనేరు రంగారావు కమిటీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణనాయక్, యోగా కోచ్ బీవీజీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రాక్టికల్స్‌పై అవగాహన సదస్సు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షల్లో ఆన్‌లైన్ మార్కుల నమోదుపై స్థానిక ఎస్‌కేఆర్ మహిళా కళాశాలలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. రీజినల్ ఇంటర్మీడియెట్ బోర్డు అధికారి, జిల్లా పరీక్షల విభాగం కన్వీనర్ ఎస్ఎస్‌వీఎల్ నర్సింహం ఆన్‌లైన్‌లో మార్కులు నమోదు చేసే పక్రియను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధ్యాపకులకు వివరించారు. వృక్ష, జంతు, భౌతిక, రసాయన శాస్త్రాల్లో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించే విధానాన్ని వివరించారు. ఈ సదస్సుల్లో జిల్లాతో పాటు అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం, చింతూరు డివిజన్ అధ్యాపకులు పాల్గొన్నారు.

నేటి నుంచి విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం మహాసభలు



ఉమర్ ఆలీషా

పిఠాపురం: విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం 96వ వార్షిక మహాసభలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. ఈ మహాసభలను ఈ నెల 11వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా తెలిపారు. పిఠాపురంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 1472లో స్థాపించిన ఈ పీఠం 552 సంవత్సరాలుగా దేశ సమగ్రత, విశ్వ మానవ శాంతి కోసం పాటు పడుతోందని చెప్పారు. అర్ష సూఫీ సిద్ధాంతం స్ఫూర్తితో సర్వమత సమ్మతమైన ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ప్రజలకు అందిస్తున్నామన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో 108 శాఖల ద్వారా త్రయీ (మహామంత్ర, జ్ఞాన, ధ్యాన) సాధనలతో కూడిన ఆధ్యాత్మిక తత్వాన్ని ప్రబోధించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ మహాసభల్లో పీఠం ఆశయాలు ప్రతిబింబించేలా 28 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని డాక్టర్ ఉమర్ ఆలీషా తెలిపారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ కేశవ వర్ధన్‌రెడ్డి

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహ స్వామివారి దేవస్థానంలో రానున్న స్వామివారి కల్యాణ మహోత్సవాలకు తరలివచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా, మెరుగైన వసతుల కల్పనకు ఆయా శాఖలు సమన్వయంతో పనిచేయాలని అమలాపురం ఆర్డీఓ జి.కేశవవర్ధన్ రెడ్డి ఆదేశించారు. గురువారం అంతర్వేది ఆలయ ప్రాంగణంలో ఈ నెల 16 నుంచి 25వ తేదీ వరకూ నిర్వహించనున్న స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవాల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో ఆర్డీఓ సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా కల్యాణ మండపం వద్ద డెకరేషన్, రథయాత్రకు రథం సిద్ధం చేయడం, బీచ్‌లో పౌర్ణమి స్నానాల ఏర్పాట్లు, గజ ఈతగాళ్ల నియామకం, తెప్పోత్సవం నిర్వహించే చోట చేయాల్సిన ఏర్పాట్లపై ఆయా శాఖల బాధ్యులతో సుదీర్ఘంగా చర్చించారు. వీటితో పాటు తీర్థంలో విద్యుత్ పనులు, భక్తులు సేద తీరే ప్రదేశాలు, పోలీసు బందోబస్తు, పార్కింగ్ స్థలాలు, సీసీ కెమెరాలు నెలకొల్పడం వంటి వాటిపై పలు సూచనలు చేశారు. అలాగే ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా తాగునీటి సరఫరాపై, పంచాయతీ చేపట్టాల్సిన పారిశుధ్యంపై కూడా సమీక్షించారు. సమావేశంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, తహసీల్దార్ సీహెచ్ పెద్దిరాజు, ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ కొండా జాన్ బాబు, పలు శాఖల డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీఓ

ఉత్సవాల్లో ఆయా శాఖలు చేపడుతున్న ఏర్పాట్లను క్షేత్ర స్థాయిలో ఆర్డీఓ పరిశీలించారు. అంతర్వేది బీచ్ వద్ద, అంతర్వేది తాగునీటి చెరువు వద్ద, రథయాత్ర సాగే మార్గాలను ఆయన అధికారులతో కలిసి సందర్శించారు.

'సంక్షేమం-అభివృద్ధి'పై జేఎన్‌టీయూకేలో నేడు చర్చా వేదిక

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): 'సంక్షేమం – అభివృద్ధి, సమ్మిళిత పాలన – ప్రగతి పాలన.. ప్రగతి పథంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం' అనే అంశంపై జేఎన్‌టీయూకేలో శుక్రవారం చర్చా వేదిక నిర్వహిస్తున్నారు. ఓపెన్ మైండ్ సొసైటీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అజేయ కల్లాం, జేఎన్‌టీయూకే ఉపకులపతి డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ మాజీ వీసీ ఎస్.వెంకటరావు, ఉన్నత విద్య కమిషనర్ డాక్టర్ ఎస్.రాజశేఖరరెడ్డి, ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ శేషారెడ్డి హాజరవుతున్నారు. విద్యార్థులు, మేధావులు, విద్యావేత్తల నుంచి అభిప్రాయాలు సేకరించి, ఏమైనా లోపాలుంటే సరి చేసుకోవడానికి వీలుగా ప్రభుత్వానికి పంపిస్తామని ఓపెన్ మైండ్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖరరెడ్డి తెలిపారు.

హెచ్‌ఎం అకౌంట్ టెస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలో అర్హత కలిగిన ఉపాధ్యాయులకు నిర్వహించే హెచ్‌ఎం అకౌంట్ టెస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. పరీక్షల కమిషనర్ లక్ష్మీకుమారి గురువారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు పంపాలన్నారు. ఒక పేపర్‌కు రూ.100, రెండు పేపర్లకు రూ.150 చొప్పున సీఎఫ్ఎంఎస్ ద్వారా ఈ నెల 17వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలని తెలిపారు. 18 నుంచి 22వ తేదీ వరకూ రూ.60 అపరాధ రుసుంతో చెల్లించవచ్చన్నారు. అపరాధ రుసుం లేని దరఖాస్తులను 18, అపరాధ రుసుం చెల్లించిన దరఖాస్తులు 23 తేదీల్లోగా రాజమహేంద్రవరంలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సుకు..

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు లక్ష్మీకుమారి తెలిపారు. డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, హ్యాండ్లూమ్ అండ్ వీవింగ్ లోయర్, హయ్యర్ కోర్సులకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. డ్రాయింగ్ లోయర్‌కు రూ.100, హయ్యర్‌కు రూ.150, ఎంబ్రాయిడరీ, హ్యాండ్లూ అండ్ వీవింగ్ లోయర్‌కు రూ.150, హయ్యర్‌కు రూ.200 చొప్పున ఈ నెల 20వ తేదీలోపు ఫీజు చెల్లించాలని సూచించారు. రూ.50 అపరాధ రుసుంతో 29వ తేదీలోపు, రూ.75 అపరాధ రుసుంతో మార్చి 6వ తేదీలోపు ఫీజు చెల్లించవచ్చన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

వచ్చే నెల 3న పీఏటీ టెస్టు

జిల్లాలో ప్రొఫెషనల్ అడ్వాన్స్‌డ్ టెస్ట్(పీఏటీ)కు దరఖాస్తు చేసిన ఉపాధ్యాయులందరికీ మార్చి 3న పరీక్ష నిర్వహించనున్నారని లక్ష్మీకుమారి తెలిపారు. అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు తీసుకుని, పరీక్షకు హాజరు కావాలని సూచించారు.

డీఎల్ఎడ్ సెమిస్టర్ పరీక్ష ఫీజుకు 11 వరకూ గడువు

జిల్లాలో జరిగే డీఎల్ఎడ్ మొదటి సెమిస్టర్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 11వ తేదీలోగా ఎటువంటి అపరాధం రుసుం లేకుండా ఫీజు చెల్లించవచ్చని లక్ష్మీకుమారి తెలిపారు. రూ.50 ఆలస్య రుసుంతో ఈ నెల 15 వరకూ చెల్లించవచ్చన్నారు.

ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత



అనపర్తిలో పోలింగ్ కేంద్రాన్ని, స్ట్రాంగ్ రూమును పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత

అనపర్తి: ఎలక్షన్ కమిషన్ ఎప్పుడు నోటిఫికేషన్ విడుదల చేసినా సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత సిబ్బందికి సూచించారు. ఓటర్ల జాబితా తదితర అంశాలపై ఎన్నికల అధికారులు, బూత్ లెవెల్ అధికారుల(బీఎల్ఓ)తో నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని స్థానిక జీబీఆర్ విద్యా సంస్థల సెమినార్ హాలులో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, బీఎల్ఓలు తమ పరిధిలోని ఓటర్ల జాబితాపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. దీనిలో భాగంగా ఓటరు పేరు, ఫొటో గుర్తింపు పరిశీలన చేయడంతో పాటు అవి సక్రమంగా ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని సూచించారు. ఓట్ల తొలగింపు, చేర్పులు, మార్పులు, డబుల్ ఎంట్రీలు, కొత్త ఓటర్ల చేరిక విషయంలో పూర్తి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకునేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనకు బీఎల్ఓలు వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రాల వద్ద సంబంధిత బీఎల్ఓ పేరు, ఫోన్ నంబర్ తప్పక ప్రదర్శించాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం నియమ, నిబంధనల ప్రకారం అధికారులు సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఈ విషయంలో ఎటువంటి తప్పిదాలకు, అలసత్వానికి తావులేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇదిలావుండగా స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసే డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను కలెక్టర్ మాధవీలత పరిశీలించి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. తాత్కాలిక స్ట్రాంగ్ రూము వద్ద కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పోలింగ్ కేంద్రాన్ని, పాఠశాలలో తరగతి గదిని సందర్శించి, విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్, రిటర్నింగ్ అధికారి ఎం.మాధురి, ఈఆర్ఓలు బి.నాగరాజునాయక్, డి.సునీల్‌బాబు, లతీష్‌బాషా, టి.రామచంద్రారెడ్డి, ఎంఈఓ-2 నల్లమిల్లి సత్తిరెడ్డి, హెచ్‌ఎం పులగం వెంకటరెడ్డి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు తీపి కబురు

- విడుదలైన డీఎస్సీ-2024 షెడ్యూల్
- ఉపాధ్యాయ శిక్షణార్థుల్లో ఉత్సాహం
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 237 పోస్టులు



విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

రాయవరం/బాలాజీచెరువు (కాకినాడ): రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యమిస్తున్న విషయం అందరికీ తెలిసిందే. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి పాఠశాలల అభివృద్ధితో పాటు, నాణ్యమైన విద్యను అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించే క్రమంలో భాగంగా ఉపాధ్యాయులకు భారీగా పదోన్నతులు కల్పించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులను నియమిస్తూ వస్తున్న ప్రభుత్వం తాజాగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ-2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో ఉపాధ్యాయ కొలువుల్లో చేరేందుకు కలలు కంటున్న నిరుద్యోగులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీపి కబురు అందించినట్లయింది. డీఎస్సీ-2024 నోటిఫికేషన్ నిరుద్యోగులకు వరంగా మారింది.

నోటిఫికేషన్ విడుదల

డీఎస్సీ నోటిఫికేషన్‌ను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ బుధవారం విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 6,100 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువరించారు. ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా 2,289 స్కూల్ అసిస్టెంట్, 2,280 ఎస్‌జీటీ పోస్టులు, 1,264 టీజీటీ పోస్టులు, 215 పీజీటీ పోస్టులు ఉన్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ కేటగిరీలకు చెందిన 237 పోస్టులు భర్తీ కానున్నట్లు తెలుస్తోంది. వీటిలో స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజ్-1-44, ఎస్ఏ లాంగ్వేజ్-2-07 స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిషు-38, ఎస్ఏ గణితం-15, ఎస్ఏ (పీఎస్)-04, ఎస్ఏ (బయాలజీ)-15, ఎస్ఏ (సోషల్)-12, ఎస్ఏ(ఫిజికల్ ఎడ్యుకేషన్)-102 పోస్టులు ఖాళీలున్నట్లుగా సమాచారం. ఎస్‌జీటీ ఖాళీలు ప్రస్తుతం లేనట్లుగా తెలుస్తోంది. అయితే అధికారికంగా దీనిపై స్పష్టత రావాల్సి ఉంది. డీఈడీ, బీఈడీ కోర్సులు పూర్తి చేసుకుని డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 12వ తేదీ నుంచి భర్తీ ప్రక్రియ ప్రారంభం కానుండగా, ఉపాధ్యాయ పోస్టులకు అర్హత పరీక్షగా భావించే టెట్ ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. ఫిబ్రవరి 27 నుంచి మార్చి 9వ తేదీ వరకు ఏపీ టెట్ పరీక్షలు నిర్వహిస్తారు. మార్చి 14న టెట్ ఫలితాలు విడుదల కానున్నాయి. మార్చి 15 నుంచి 30వ తేదీ వరకు డీఎస్సీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

అభ్యర్థుల్లో ఆనందం

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం, పరీక్షల తేదీలను కూడా ప్రకటించడంతో ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకుని డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థుల్లో ఆనందం కనిపిస్తోంది. ఇచ్చిన మాట ప్రకారం డీఎస్సీని విడుదల చేశారని ఉపాధ్యాయ పోస్టులకు ఎదురుచూస్తున్న అభ్యర్థులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. డీఎస్సీలో జిల్లాల వారీగా ఎన్ని పోస్టులు ఉన్నాయి. వాటిలో తాము పోటీ పడుతున్న వాటిలో ఎన్ని ఖాళీలు ఉన్నాయో తెలుసుకునే పనిలో అభ్యర్థులు ఉన్నారు. పలువురు అభ్యర్థులు ఉద్యోగాలకు పోటీ ఏ రేంజ్‌లో ఉంటుందో లెక్కలు వేసుకుంటున్నారు.

క్లుప్తంగా

రైలు నుంచి జారి పడి కేరళ వాసి మృతి

తుని: కేరళ రాష్ట్రానికి చెందిన యువకుడు రైలు నుంచి జారిపడి మృతి చెందాడని తుని జీఆర్పీ ఎస్సై ఎస్కే అబ్దుల్ మారూఫ్ గురువారం తెలిపారు. కేరళ రాష్ట్రం ఎర్నాకులం జిల్లా మణికంపూడి గ్రామానికి చెందిన ఆఖిల్ జార్జ్(24) అన్నవరం–రావికంపాడు రైల్వేస్టేషన్ మధ్యలో గుర్తుతెలియని రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. మూడు రోజులు కావడంతో మృతదేహం కుళ్లిపోయింది. మృతుడి దగ్గర దొరికిన ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ ఆధారంగా మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. ఈ నెల 3న విశాఖపట్నంలో జరిగిన ఇంగ్లాండ్, భారత్ టెస్ట్ క్రికెట్ మ్యాచ్ చూసేందుకు కేరళ నుంచి వచ్చాడని, తిరుగు ప్రయాణంలో వెళుతుండగా ప్రమాదశాత్తూ జారిపడి మృతి చెందాడన్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్సై మారూఫ్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మృతుడు శివ

పిఠాపురం: స్థానిక అగ్రహారంలో నివాసముంటున్న అనుపోజు శివ (35) గురువారం అనుమానాస్పద స్థితిలో ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం నాలుగు రోజులుగా మృతుడి భార్య సుధారాణితో గొడవ పడుతున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం మృతుడు తన తమ్ముడికి ఫోన్ చేసి బయటకు వెళదాం రమ్మని పిలిచాడు. ఇద్దరు బయటకు వెళ్లి వచ్చారు. కొద్ది సేపటికే శివ ఇంట్లో ఉరి వేసుకుని ఉన్నట్లు గుర్తించిన స్థానికులు అతని తమ్ముడికి సమాచారం ఇచ్చారు. ఇంట్లో భార్య లేకపోవడంతో మృతుని బంధువులు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పట్టణ ఎస్సై మురళీ మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


నిడదవోలు.. ప్రగతి జోరు



నిడదవోలు పట్టణంలో నాలుగు లేన్ల రోడ్డు



వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్



- ఐదేళ్లలో మున్సిపాలిటీలో గణనీయమైన అభివృద్ధి
- సంక్షేమ పథకాల ద్వారా రూ.352.85 కోట్ల లబ్ధి
- వివిధ అభివృద్ధి పనులకు రూ.371.33 కోట్ల వ్యయం
- పరిశుభ్రతతో పట్టణంలో ఆహ్లాదకర వాతావరణం

నిడదవోలు: వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన ఐదేళ్లలో నిడదవోలు పురపాలక సంఘంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జోరుగా జరుగుతున్నాయి. పలు పనులు నిర్మాణ దశలో ఉన్నాయి. మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఓ పక్క పట్టణాభివృద్ధితో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో అనేక కుటుంబాలు ఆర్థికంగా వృద్ధి చెందాయి. పట్టణంలో అన్ని వార్డులలో స్వచ్ఛాంధ్రప్రదేశ్‌లో భాగంగా పారిశుధ్యం, పరిశుభ్రతతో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించారు. ఐదేళ్ల పాలనలో సంక్షేమ పథకాల ద్వారా రూ.352.85 కోట్ల లబ్ధి చేకూరింది. రూ.371.33 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. వీటిలో పలు పనులు జరుగుతున్నాయి.

ఆర్‌ఓబీ నిర్మాణానికి శ్రీకారం

ఉభయ గోదావరి జిల్లాల చిరకాల కోరిక నిడదవోలు రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానానికి అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది. సీఆర్‌ఐఎఫ్ నిధులు రూ.185 కోట్లు మంజూరు కావడంతో పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. నిడదవోలు పట్టణంతో పాటు సమిశ్రగూడెం గ్రామంలో భూసేకరణలో భాగంగా స్థలాలు, నిర్మాణాలు కొల్పోయిన వారికి ఎమ్మెల్యే జి. శ్రీనివాసనాయుడు కృషితో ఇప్పటికే రూ.10.55 కోట్లు పరిహారంగా అందజేశారు. దీంతో వ్యాపారులు, నిర్వాసితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు ఆర్‌ఓబీ నిర్మాణం పూర్తి చేస్తానని ప్రజలకు ఇచ్చిన హామీ నెరవేరనుంది.

పేదలకు కార్పొరేట్ వైద్యం

పట్టణంలోని వైఎస్సార్ కాలనీలో రూ.91.16 లక్షల వ్యయంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ ద్వారా ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందనున్నాయి. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పట్టణ ప్రాంతాల్లో ఉన్న పేద, మధ్యతరగతి ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం, కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు ప్రతి గడపకు అందాలనే సంకల్పంతో అర్బన్ హెల్త్ సెంటర్‌ను నిర్మించారు.



గాంధీనగర్‌లో రోడ్డు (పాతచిత్రం)



గాంధీనగర్‌లో కొత్త సీసీ రోడ్డు

ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



నిడదవోలును ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కోట్లాది రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టాం. ప్రధానంగా రోడ్లు, డ్రైయినేజీల నిర్మాణాలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ ప్రతీ వార్డులో అభివృద్ధి పనులు చేపట్టాం. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వార్డుల్లో సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించాం. ప్రధానంగా ఆర్‌వోబీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పట్టణంలో కొన్నేళ్లుగా సమస్యగా ఉన్న డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను పూర్తిగా నిర్మూలించేందుకు లెగసీ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేశాం. వార్డుల్లో ప్రాధాన్యత క్రమంలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నాం. ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడంతో పాటు విద్య, వైద్యానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నాం. నాడు–నేడు పథకంలో మున్సిపల్ పాఠశాలలను ఆధునీకరించడంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది.


– జి.శ్రీనివాసనాయుడు, నిడదవోలు ఎమ్మెల్యే

నాలుగు లేన్ల రోడ్డు విస్తరణ

పట్టణంలో పాటిమీద సెంటర్ నుంచి గణపతి సెంటర్ వరకూ నాలుగ లేన్ల రోడ్డు విస్తరణతో పాటు గణపతి జంక్షన్ అభివృద్ధి పనులను రూ.5.50 కోట్ల వ్యయంతో చేపట్టారు. గణపతి జంక్షన్ అభివృద్ధిలో భాగంగా విశాలమైన నాలుగు లేన్ల రోడ్డు, వాటర్ ఫౌంటేన్, సుందరమైన పార్కు, మంచినీటి పైప్‌లైన్, డ్రైనేజీ, బస్‌షెల్టర్ పచ్చదనంతో కూడిన ఆహ్లాదకరమైన సుందరీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

అభివృద్ధి కార్యక్రమాలు	పనుల సంఖ్య	నిధులు
సీసీ రోడ్లు	69	రూ.10.93 కోట్లు
సీసీ డ్రైన్‌లు	75	రూ.6.25 కోట్లు
మంచినీటి సరఫరా	42	రూ.2.23 కోట్లు
వీధి దీపాల నిర్వహణ	14	రూ.67.28 లక్షలు
పార్కుల సుందరీకరణ	8	రూ.77.80 లక్షలు
నాడు–నేడు (మొదటి విడత)	8	రూ.2.22 కోట్లు
నాడు–నేడు (రెండవ విడత)	13	రూ.5.91 కోట్లు
నాడు–నేడు (రెండవ విడత (ఎ)	9	రూ.7.75 లక్షలు
వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్	2	రూ.1.01 కోట్లు
ఏఐఐబీ పథకం (గోదావరి జలాల సరఫరా)	2	రూ.58.09 కోట్లు
పేదలందరికీ ఇళ్ల పథకం (రోడ్లు)	8	రూ.2.33 కోట్లు
పేదలందరికీ ఇళ్ల పథకం (పూడిక పనులు)	6	రూ.5.07 కోట్లు
పేదలందరికీ ఇళ్ల పథకం (నీటి సరఫరా)	7	రూ.1.65 కోట్లు
డంపింగ్ యార్డు ఘనపదార్థాలు వేరుచేయడం	1	రూ.3.29 కోట్లు
డంపింగ్ యార్డు ప్రోసెసింగ్	1	రూ.23.88 లక్షలు
మాలకోడు (మురుగునీరు శుద్ధీకరణ)	1	రూ.6.10 లక్షలు
మురుగునీరు శుద్ధీకరణ (ప్లాంట్)నిర్మాణం	1	రూ.4.95 కోట్లు
మాలకోడు సుందరీకరణ	1	రూ.4.52 కోట్లు
జగనన్న కాలనీలో నీటి సరఫరా	1	రూ.5.30 కోట్లు
మల వ్యర్థ శుద్ధీకరణ నిర్మాణం	1	రూ.2.05 కోట్లు
చెత్త సేకరణ (ఈ–ఆటోలు)		రూ.24.06 లక్షలు
రివర్‌ఫ్రంట్ పార్కు	1	రూ.1.00 కోట్లు
ఈటింగ్ స్ట్రీట్	1	రూ.80.00 లక్షలు
గణపతి జంక్షన్ అభివృద్ధి	1	రూ.67 లక్షలు
ఆర్‌అండ్‌బీ రోడ్డు	3	రూ.7.80 కోట్లు
ఆర్‌వోబీ నిర్మాణం	1	రూ.200.74 కోట్లు
గడ్డర్ బ్రిడ్జి నిర్మాణం	1	రూ.4.65 కోట్లు
100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం	1	రూ.19.60 కోట్లు
ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధి	1	రూ.6.00 కోట్లు
షాదీఖానా నిర్మాణం	1	రూ.కోటి

ప్రభుత్వ నిధులతో అభివృద్ధి



ప్రభుత్వం అందించిన ప్రోత్సాహం, నిధులతో పట్టాణాభివృద్ధి చేయగలిగాం. పట్టణంలో ఎక్కడ అవసరమైతే అక్కడ సీసీ రోడ్లు, డ్రైయినేలు నిర్మించి మౌలిక వసతులు కల్పించాం. ప్రధానంగా పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెడుతూ నాలుగు లేన్ల రోడ్లు నిర్మించాం. పట్టణంలో దీర్ఘకాలిక సమస్యలైన మాలకోడు ప్రక్షాళన, భీమదోర డ్రైయిన్ ఆధునీకరణ, డంపింప్‌యార్డు ప్రక్షాళన పనులు జరుగుతున్నాయి. పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడానికి రివర్‌ఫ్రంట్ పార్కు, ఈటింగ్ స్ట్రీట్, పలు పార్కుల అభివృద్ధి పనులు చేపట్టాం. మున్సిపాలిటీ ద్వారా ఇప్పటివరకు ఎన్నడూ లేని విధంగా రూ.371.19 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులు చేపట్టాం. పలు పనులు జరుగుతున్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే జి. శ్రీనివాసనాయుడుల ప్రోత్సాహంతో కోట్లాది రూపాయల నిధులతో పట్టణ రూపురేఖలు మార్చగలిగాం.

– భూపతి ఆదినారాయణ, మున్సిపల్ చైర్మన్, నిడదవోలు



మున్సిపల్ హైస్కూల్ నెం:03 (పాత చిత్రం)



ఆధునీకరించిన మున్సిపల్ హైస్కూల్ నెం: 03

వ్యవసాయంపైనా దృష్టి

విద్యార్థులకు 'నన్నయ' వీసీ ఆచార్య పద్మరాజు సూచన



మాట్లాడుతున్న 'నన్నయ' వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఐటీ రంగంపైనే ఆధారపడకుండా ప్రకృతి, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకుంటూ వ్యవసాయంలో నూతన ఒరవడి సృష్టించేందుకు యువత దృష్టి సారించాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) సహకారంతో యూనివర్సిటీలోని వృక్షశాస్త్ర విభాగానికి చెందిన స్టూడెంట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం, బయోకల్చర్ తయారీపై రెండు రోజులపాటు జరిగే శిక్షణ, వర్క్‌షాప్ గురువారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ కేవీకే సహకారంతో భవిష్యత్తులో ప్రకృతి వ్యవసాయ సూత్రాలు, బయోకల్చర్ తయారీపై విద్యార్థులను భాగస్వాములను చేసే విధంగా కార్యక్రమాలు రూపొందించాలని అధ్యాపకులకు సూచించారు. ప్రకృతి, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ఫుడ్ ప్రాసెసింగ్‌లపై దృష్టిని సారించాలన్నారు. కేవీకే ప్రధానాధికారి డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు మాట్లాడుతూ యూనివర్సిటీలోని వృక్ష శాస్త్ర విభాగానికి చెందిన విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయం, నేలను సంరక్షించుకోవడం వంటి అంశాలపై అవగాహన పెంచడం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా వ్యవసాయాధికారి కె. మాధవరావు, ఏపీసీఎన్ఎఫ్ (ఏపీ కమ్యూనిటీ మేనేజ్డ్ నాచ్యురల్ ఫార్మింగ్) జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బి. తాతారావు మాట్లాడుతూ జిల్లాలో 18 మండలాల్లో సుమారు 30 వేల మంది రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టారన్నారు. మొదటి రోజు శిక్షణలో పంట పోషణకు, పంట రక్షణకు సంబంధించిన 22 రకాల బయోకల్చర్స్‌ని ఏవిధంగా తయారు చేయాలో ప్రాక్టికల్‌గా అవగాహన కలిగించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి. విజయనిర్మల, కోర్సు కోఆర్డినేటర్ కె.శ్యామ్యూల్‌కుమార్, అధ్యాపకులు ప్రొఫెసర్ వి.పద్మావతి, ప్రొఫెసర్ ఎల్. ముత్యాలునాయుడు, గౌరీపార్వతి, లిఖిత, కేవీకే అధికారులు జేవీఆర్ సత్యవాణి, దిలీప్, విజయవర్ధన్, ప్రభాత్‌నాయుడు, ఎంఏరాజు, రత్నాజీ పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పర్యటన



తిరుపాల్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు ఐ.తిరుపాల్‌రెడ్డి గురువారం రాజమహేంద్రవరం వచ్చారు. రెండు రోజుల జిల్లా పర్యటన నిమిత్తం వచ్చిన తిరుపాల్‌రెడ్డిని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, మర్యాద పూర్వకంగా కలిశారు. తిరుపాల్‌రెడ్డి శుక్రవారం సామర్లకోట, పిఠాపురం, ద్రాక్షారామం, అయినవిల్లి, అంతర్వేది ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో వివిధ పంటలను పరిశీలిస్తారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఏడీఏ శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు పి.ఎస్. వీరారెడ్డి, రాష్ట్ర ఏఈవో సంఘ అధ్యక్షుడు డి.వేణు మాధవరావు, పీటర్, పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో భార్యాభర్తలకు ఏడేళ్ల జైలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఒక మహిళకు సీరియల్‌లో నటిగా అవకాశాలు ఇప్పిస్తానని చెప్పి, అత్యాచారంతో పాటు వ్యభిచారం చేయించిన కేసులో భార్యాభర్తలకు ఏడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ 8వ అడిషనల్ డిస్ట్రిక్ సెషన్స్ జడ్జి, మహిళా నేరాల విచారణ ప్రత్యేక న్యాయమూర్తి వై.బెన్నియ్యనాయుడు గురువారం తీర్పునిచ్చారు. స్థానిక ఏవీ అప్పారావు రోడ్డుకు చెందిన లంక చమక్క, ఆమె భర్త లంక నాగరాజుకు హైదరాబాద్‌కు చెందిన ఒక మహిళతో పరిచయం ఏర్పడింది. ఆమెకు సీరియల్స్‌లో అవకాశం ఇప్పిస్తామని చెప్పారు. దీంతో ఆమె భార్యాభర్తల వద్దకు వచ్చింది. ఆమెకు మాయమాటలు చెప్పి నిర్బంధించారు. తర్వాత ఆమెను తన భర్తతో చమక్క అత్యాచారం చేయించింది. అంతేకాకుండా పాలలో మత్తు పదార్థాలు కలిపి ఆ మహిళతో వ్యభిచారం చేయించారు. దీనిపై 2021 నవంబర్ 13లో ప్రకాష్ నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ ఆర్జే రవికుమార్ కేసు నమోదు చేశారు. కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ మారిశెట్టి వెంకటేశ్వరరావు వాదనలు వినిపించారు. సీఐ కేవీఎస్.సత్యనారాయణ, కోర్టు హెడ్ కానిస్టేబుల్ పి.కొండలరావును ఎస్పీ పి.జగదీష్ అభినందించారు.

మోటార్ సైకిల్ మెకానిక్ నిజాయితీ

కొత్తపేట: స్థానిక మోటార్ సైకిల్ మెకానిక్ గుబ్బల శ్రీనివాసరావు తన బ్యాంక్ బ్యాలెన్స్ చూసుకునేందుకు ఏటీఎంకు వెళ్లాడు. ఆ ఏటీఎంలో రూ.10 వేల నగదు కనిపించింది. అతను ఆ నగదును తీసుకున్నాడు. ఆ నగదు ఎవరిదో ఆరా తీయడానికి అక్కడ ఎవరూ లేరు. తనది కాని ఈ నగదు ఎవరిదైతే వారికే చెందాలని ఆలోచించి, స్థానిక ఎస్‌బీఐ బ్రాంచ్‌కు వెళ్లి అకౌంటెంట్ జి.సంతోష్‌కుమార్‌కు అందచేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ నిజాయితీని ఆయన అభినందించారు. ఏటీఎం నుంచి బయటకు వచ్చిన నగదు గురించి అకౌంటెంట్‌ను 'సాక్షి' వివరణ కోరగా శుక్రవారం క్యాష్ నాట్ టేకెన్ రిపోర్టు వస్తుందని, ఆ రిపోర్టు మేరకు సంబంధిత ఖాతాదారుని అకౌంట్‌లో నగదు జమ చేస్తామని తెలిపారు.

విజిలెన్స్ దాడుల్లో ఇద్దరి అరెస్టు

జగ్గంపేట: అక్రమంగా తరలిస్తున్న 53 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేసినట్టు జగ్గంపేట ఎంఎస్ఓ కృష్ణ గురువారం తెలిపారు. స్థానిక గోకవరం రోడ్డులో బుధవారం అర్ధరాత్రి విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పెద్దాపురం మండలం గోరింటకు చెందిన బావిశెట్టి కనకరాజు వ్యాన్‌లో తరలిస్తున్న 27.50 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. కిర్లంపూడి మండలం గోనాడ నుంచి వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 26. 20 క్వింటాళ్లబియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యం తరలిస్తున్న నల్లమశెట్టి లక్ష్మణరావును అరెస్టు చేశారు. క్రిమినల్ కేసులు నమోదు చేసి పోలీసులకు అప్పగించామని, బియ్యాన్ని సివిల్ సప్లయాస్ గొడౌన్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.జనార్దన రెడ్డి, విజిలెన్స్ కానిస్టేబుల్ వీరబాబు, వల్లి స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

టెక్నికల్ అసిస్టెంట్లకు శుభవార్త



ఇరిగేషన్ శాఖ ఈఎన్‌సీ సతీష్‌కుమార్ నుంచి ఉత్తర్వులు అందుకుంటున్న సంఘ సభ్యులు

కాకినాడ: నీటిపారుదలశాఖలో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లకు ప్రభుత్వం తీపి కబురందించింది. జూనియర్ టెక్నికల్ ఆఫీసర్లుగా పదోన్నతి కల్పించే అంశం దాదాపు 25 ఏళ్లుగా పెండింగ్‌లో ఉండగా ఇప్పుడా సమస్యను పరిష్కరిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఆంధ్రప్రదేశ్ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆనందం వ్యక్తం చేసింది. ఈ మేరకు సంఘ ప్రధాన కార్యదర్శి ఎస్.ఎల్.సోమయాజులు, ప్రచార కార్యదర్శి టి.దొరబాబు ఒక ప్రకటనలో సంతోషం వెలిబుచ్చారు. వివిధ ఇంజినీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లకు మూడేళ్లకే జూనియర్ టెక్నికల్ ఆఫీసర్లుగా పదోన్నతులు వస్తుండగా ఇరిగేషన్ శాఖలో మాత్రం పదేళ్లకు పైబడి పెండింగ్‌లో ఉండిపోతున్నాయన్నారు. ఈ సమస్యను పరిష్కరించేలా ప్రభుత్వం చొరవ తీసుకుని సీనియారీని 1997 నుంచి పునరుద్ధరిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ మేరకు ప్రభుత్వ ఉత్తర్వులను ఇంజినీరింగ్‌శాఖ ఈఎన్‌సీ సతీష్‌కుమార్ తమ సంఘానికి అందజేశారని చెప్పారు. ఇందుకు తోడ్పాటునందించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు చెప్పారు. అలాగే తమ చిరకాలవాంఛగా ఉన్న గెజిటెడ్ హోదాపై కూడా ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు.